## క్లుప్తంగా

### నేడు దేవాలయ భూముల బహిరంగ వేలం

**హుజూర్‌నగర్ రూరల్ :** మండలంలోని లింగగిరిలో ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయ వ్యవసాయ భూములను 2023 నుంచి 2025 వరకు కౌలుకు ఇచ్చేందుకు గురువారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కొండారెడ్డి బుధవారం తెలిపారు. ఆసక్తి గల వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

### జిల్లా అధ్యక్షుడిగా గోవిందరావు నియామకం



**హుజూర్‌నగర్ :** జాతీయ చేనేత ఐక్యవేదిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా హుజూర్‌నగర్‌కు చెందిన బొడ్డు గోవిందరావును నియమిస్తూ ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, రాష్ట్ర అధ్యక్షుడు మాడ రాజా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం గోవిందరావు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా గోవిందరావు నియామకం పట్ల జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ, మండల, పట్టణ నాయకులు, పద్మశాలి సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

### బ్రాంచ్ పోస్టుమాస్టర్‌కు సన్మానం



పోస్టుమాస్టర్, సర్పంచ్‌ను సన్మానిస్తున్న వెంకటేశ్వర్లు, తదితరులు

**మునగాల :** మహిళా సమ్మాన్ సేవింగ్స్ పోస్టల్ ఖాతా గురించి ప్రచారం చేసి 182 మంది మహిళలతో ఖాతాలు తెరిపించేందుకు కృషి చేసిన మండలంలోని మాధవరం బ్రాంచ్ పోస్టుమాస్టర్ జ్యోతిని బుధవారం తపాల శాఖ జిల్లా సూపరింటెండెంట్ వడ్లమూడి వెంకటేశ్వర్లు, ఐపీఓ గాని సురేష్‌గౌడ్‌లు పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే పోస్టుమాస్టర్ జ్యోతికి సహకరించిన సర్పంచ్ నంద్యాల విజయలక్ష్మిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ అప్పయ్య, మహిళలు మేడం పున్నమ్మ, రేవతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

### కంటి వెలుగు సిబ్బంది సేవలు అభినందనీయం



కంటి వెలుగు సిబ్బందిని సన్మానించిన సర్పంచ్

**మోతె :** మండల పరిధిలోని సిరికొండ గ్రామంలో కంటి వెలుగు పథకం ద్వారా గత 25 రోజులుగా గ్రామ ప్రజలకు సేవలు అందించిన కంటి వెలుగు సిబ్బందిని బుధవారం సర్పంచ్ నూకల సావిత్రమ్మ ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కంటి వెలుగు వైద్య సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నూకల శ్రీనివాసరెడ్డి కంటి వెలుగు డాక్టర్ నాగలక్ష్మి, డీఈఓ రమాకాంత్, ఆప్తమాలిక్ చామంతి, పీహెచ్ఎన్ సీత, ఏఎన్ఎం జయసుధ, ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

### బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న టీడీపీ నాయకులు

**చిలుకూరు :** చిలుకూరులోని రావినారాయణరెడ్డి కాలనీకి చెందిన నిరుపేద తలారి రంగమ్మకు బుధవారం టీడీపీ మండల కన్వీనర్ కొండా సోమయ్య 50 కేజీల బియ్యం, మండల ప్రచార కార్యదర్శి కొల్లు సత్యనారాయణ 25 కేజీల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు గుండు వీరబాబు, మస్తాన్, ఖాజా, మరీదు శ్రీను, కొండా చిన లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

### హరీశ్‌రావు పర్యటనను విజయవంతం చేయాలి

**మఠంపల్లి :** మండల కేంద్రంలో ఈనెల 26న నిర్వహించబోయే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి విచ్చేస్తున్న రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు పర్యటనను విజయవంతం చేయడానికి కదిలిరావాలని కోరుతూ స్థానిక సర్పంచ్, వర్ధాపురం క్లస్టర్ ఇన్‌చార్జ్ మన్నెం శ్రీనివాసరెడ్డి, భారతమ్మ దంపతులు బుధవారం రాత్రి గడపగడపకు ప్రచారం నిర్వహించారు. అనంతరం మండలంలోని పలు గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు పిండిప్రోలు రామచంద్రయ్య, మాజీ సర్పంచ్ కొండేటి సుధాకర్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ బీవీ.రామారావు, కొమ్ము సైదులు, వల్లపుదాసు సురేష్‌గౌడ్, బాలక్రిష్ణగౌడ్, వార్డు సభ్యులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలపై జాగ్రత్త

- నకిలీ విత్తనాల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- ముమ్మరంగా తనిఖీలు చేస్తున్న టాస్క్ ఫోర్స్ బృందాలు
- పేరున్న కంపెనీల విత్తనాలనే కొనుగోలు చేయాలంటున్న అధికారులు



కోదాడలో విత్తనాల దుకాణంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు, టాస్క్ ఫోర్స్ బృందం (ఫైల్)

**కోదాడరూరల్ :** వానాకాలం వ్యవసాయ సీజన్ కొద్ది రోజుల్లో ప్రారంభం కానుంది. దీంతో రైతులు సాగులో నిమగ్నమయ్యేందుకు సిద్ధమవుతున్నారు. అయితే చేనులో మానుడే చల్లి కుండేడు దెవులాడుకునే రైతన్నకు నకిలీ విత్తనాల బెడద లేకుండా ఉండేందుకు ప్రభుత్వం నివారణ చర్యలు చేపడుతోంది. అయినా ఏదో ఒక విధంగా మార్కెట్‌లోకి నకిలీ విత్తనాలు వచ్చి రైతులు మోసపోతూనే ఉన్నారు. దీంతో వేల రూపాయల పెట్టుబడులు పెట్టి సాగులో దిగుబడి రాక రైతులు పలు విధాలుగా నష్టపోతున్నారు. కావున గ్రామాల్లో రైతులు తక్కువ ధరకు వస్తున్నాయని దళారుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని అధికారులు సూచిస్తున్నారు. డీలర్ల వద్ద నాణ్యమైన విత్తనాలనే కొనుగోలు చేయాలని చెబుతున్నారు. కాగా కోదాడ డివిజన్‌లో ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో లక్ష ఎకరాల్లో వరి, 20 వేల ఎకరాల్లో పత్తి, 7 వేల ఎకరాల్లో మిర్చి సాగు అయ్యే అవకాశం ఉందని రైతులు అంచనా వేస్తున్నారు.

**ముమ్మరంగా తనిఖీలు..**

నకిలీ విత్తనాల బెడద నుంచి రైతులను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసింది. ఏ ఒక్క రైతు కూడా విత్తనాలతో నష్టపోకుండా టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో విత్తన షాపుల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ యాక్ట్ కూడా పెట్టాల్సి వస్తుందని డీలర్లు, షాపుల యజమానులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. గ్రామాల్లో కొందరు ఇతర ప్రాంతాల నుంచి ఎలాంటి బిల్లులు లేకుండా విత్తనాలు తెచ్చి విక్రయిస్తుంటారని వారిపై నిఘా పెట్టాలని రైతు సమన్వయ సమితి సభ్యులను కూడా అప్రమత్తం చేశారు.

**దళారులను నమ్మి మోసపోవద్దు**



రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు. నాణ్యమైన, పేరున్న కంపెనీల విత్తనాలను అనుమతులున్న డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలి. విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంటకాలం పూర్తి అయ్యేంత వరకు జాగ్రత్తగా పెట్టుకోవాలి.

– పాలెం రజిని, ఏఓ, కోదాడ.

## కందిబండ గ్రామంలో కలెక్టర్ పర్యటన

**మేళ్లచెరువు :** మండలంలోని కందిబండ గ్రామంలో జిల్లా కలెక్టర్ వెంకట్రావు బుధవారం పర్యటించారు. గల ఆరోగ్య ఉప కేంద్రాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య ఉప కేంద్రంలోని ప్రజలకు అందుతున్న సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి చిన్నారులకు, పిల్లల తల్లులకు, గర్భిణులకు అందించే పోషకాహారం సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామంలోని వీధుల్లో పర్యటించి పారిశుద్ధ్య పనుల వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలోని వీధుల్లో పెంట దిబ్బను చూసి దాన్ని తొలగించాలని, పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని పంచాయతీ కార్యదర్శిని, సర్పంచ్‌ను ఆదేశించారు. అలాగే కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం చింతలపాలెం మండలానికి వెళ్తుండగా కలెక్టర్ స్వల్ప అస్వస్థతకు గురికావడంతో ప్రథమ చికిత్స చేయించుకుని తిరిగి సూర్యాపేటకు వెళ్లారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అబ్రహం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మంగమ్మ, పంచాయతీ కార్యదర్శి రషీద్, ఆరోగ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

**గోడౌన్ పరిశీలన**

**మేళ్లచెరువు :** మండల కేంద్రం శివారులో గల గోడౌన్‌లను జిల్లా కలెక్టర్ వెంకట్రావు సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ రాంపతి నాయక్‌తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 వేల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని నిల్వ చేయడానికి అద్దె ప్రతిపాదికన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ గోదాంను పరిశీలించినట్లు తెలిపారు. అనంతరం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. అదేవిధంగా హరితహారం ఏర్పాట్ల గురించి ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.



కందిబండలో ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

## అభివృద్ధిలో దూసుకెళ్తున్న హుజూర్‌నగర్

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

**గరిడేపల్లి :** హుజూర్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధిలో దుసుకెళ్తోందని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో రూ. 20 లక్షలతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఆవాస కేంద్రాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సీఎం కేసీఆర్ గ్రామ పంచాయతీల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ భవనానికి స్థలం ఇచ్చిన దాత స్థానిక సర్పంచ్ కుసుమ వెంకటమ్మశ్రీనివాస్‌రెడ్డిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ పోరెడ్డి శైలజారవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, ఎంపీడీఓ వనజ, సర్పంచ్ కుసుమ వెంకటమ్మశ్రీనివాసరెడ్డి, గుత్తికొండ వెంకటరమణరెడ్డి, వీరంరెడ్డి సెంబిరెడ్డి, గురువయ్య, రేవూరి కాశయ్య, స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

**గీత కార్మికుల అభివృద్ధికి కృషి**

**గరిడేపల్లి :** తెలంగాణలో రైతు బంధు మాదిరిగా గీత బంధు అమలు చేసేందుకు సీఎం కేసీఆర్ చర్యలు చేపడుతున్నారని, గీత కార్మికుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కుతుబ్‌షాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని 130 మంది గీత కార్మికులకు ఆబ్కారి శాఖ ద్వారా మంజూరైన లైసెన్స్‌లను గీత కార్మికులకు పంపిణీ చేసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ కుల వృత్తులను గౌరవించి వారిని ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. త్వరలో చేయూత పథకం కింద లక్ష రూపాయలు అందిస్తామన్నారు. లైసెన్స్‌ల మంజూరులో, కుతుబ్‌షాపురం గీత సొసైటీ పునరుద్ధరణలో కీలక పాత్ర పోషించిన గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎల్ఎన్ ప్రసాద్‌ను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, తాళ్లమల్కాపురం మాజీ ఎంపీటీసీ కుక్కడపు గురువయ్య, సర్పంచ్ వీరమ్మభాస్కర్, ఎంపీటీసీ అరుణ భిక్షం, పెండెం వీరయ్య గౌడ్, గురువయ్య, మోహన్, అరవింద్, తదితరులు ఉన్నారు.



గరిడేపల్లి : లక్ష్మీపురంలో గ్రామ పంచాయతీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే



కుతుబ్‌షాపురంలో గీత కార్మికులకు లైసెన్స్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

## ఆలయాల వార్షికోత్సవం.. ఊరంతా కోలాహలం

**గరిడేపల్లి :** మండల కేంద్రంలోని రామాలయం, శివాలయం, గుండాలమ్మ ఆలయాల ప్రతిష్ఠాపనోత్సవాలను బుధవారం గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. రామాలయంలో సీతారామచంద్రుల విగ్రహాలు, శివాలయంలో ధ్వజస్తంభం, గుండాల మెట్టులో గుండాలమ్మ విగ్రహం ప్రతిష్ఠించి ఏడాది పూర్తయిన సందర్భంగా వేదపండితులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయంలో ఘట్టాభిషేకం కార్యక్రమంలో భాగంగా మహిళలు శివలింగం మునిగే వరకు నీటితో అభిషేకం చేశారు. రామాలయంలో పెద్దఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గుండాలమ్మ ఆలయానికి మహిళలు బోనాలతో పెద్దఎత్తున తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా గుండాల మెట్టులో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పండుగలు ఐక్యతకు నియలమన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ సుజాతాశ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ పోరెడ్డి శైలజారవీందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ కడియం స్వప్న, సర్పంచ్ సీతరాంరెడ్డి, ప్రధాన పూజారులు కొంపెల్లి కృష్ణశాస్త్రి, సుదర్శనం శ్రీనివాసాచార్యులు, బదరీ శ్రీనివాసాచార్యులు, సుదర్శనం రాజన్‌చార్యులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు పెండెం శ్రీనివాస్‌గౌడ్, నలజాల రామారావు, గుండాలమ్మ తల్లి కమిటీ సభ్యులు పెండెం వీరయ్యగౌడ్, కడియం సైదిరెడ్డి, నారాయణ, మచ్చపోతుల కృష్ణ, పెండెం ముత్యాలు, వీరాంజనేయులు, కాశయ్య, రాజన్, చంద్రయ్య, నారాయణ, షేక్ రాజ మహ్మద్, నాయకులు పాల్గొన్నారు.

**పట్టు వస్త్రాలు సమర్పణ..**

కాగా గరిడేపల్లిలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కళ్యాణ మహోత్సవంలో స్వామివారికి విశ్వబ్రాహ్మణ నిత్య అన్నదాన సత్రం (మట్టపల్లి క్షేత్రం) అధ్యక్షుడు ఈశ్వరమ్మ– సూర్యనారాయణచారి దంపతులు సమర్పించారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

## విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

**మఠంపల్లి :** విధుల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని కోదాడ డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) శ్రీరాములు అన్నారు. బుధవారం ఆయన మఠంపల్లి మండలంలోని తుమ్మల తండా, వర్ధాపురం, మంచ్యాతండా గ్రామపంచాయతీలలో జరుగుతున్న అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీలలో సెగ్రిగేషన్ షెడ్డులో వర్మీ కంపోస్టు తయారీ, చెత్త డంపింగ్, పల్లె ప్రకృతి వనాలు, పారిశుద్ధ్య పనులను పరిశీలించి మాట్లాడారు. వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. 9వ విడత హరిత హారానికి నర్సరీలను ఏపుగా పెంచాలన్నారు. ప్రభుత్వం పంచాయతీలకు సరిపడా నిధులు విడుదల చేస్తున్నందున అభివృద్ధి పనులను మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు టీక్యానాయక్, బచ్చలకూరి అఖిలాబాబు, సపావట్ మీనాసక్రియా, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, తదితరులున్నారు.



తుమ్మలతండాలో సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ శ్రీరాములు

## అభివృద్ధి పనుల్లో జాప్యం చేయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ భూక్యా గోపాల్

**పాలకవీడు :** మండలంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో జాప్యం జరగకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీపీ భూక్యా గోపాల్ అన్నారు. బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. మండలంలో మన ఊరు– మన బడి పనులను పూర్తిచేయాలని, యల్లాపురం, గుండెబోయినగూడెం, జాన్‌పహాడ్ ఎస్సీ కాలనీ, చెరువుతండా గ్రామాల్లో తరచూ ఏర్పడుతున్న విద్యుత్ సమస్యను పరిష్కరించాలన్నారు. బెట్టితండా, యల్లాపురంలలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎంపీటీసీ వెంకటయ్య కోరారు. రైతులకు పంట రుణాలు అందజేయడంలో బ్యాంకర్లు చొరవ చూపాలని ఎంపీపీ కోరగా పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి స్పందించి రుణాల బకాయిలు పెద్దఎత్తున పేరుకుపోయాయని బకాయిలు రెన్యువల్ చేసుకుంటే తప్ప కొత్త రుణాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. పలు గ్రామాల్లో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ఎంపీపీ కోరగా మఠంపల్లి నుంచి జాన్‌పహాడ్ వరకు బీటీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయని, బెట్టితండా– శూన్యపహాడ్, పాలకవీడు నుంచి అలింగాపురం వరకు గల రోడ్లకు నిధులు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామపంచాయతీ నిధుల ఫ్రీజింగ్ ఎత్తివేసినట్లు ఎంపీఓ దయాకర్ తెలిపారు. ట్రాక్టర్ బకాయిలు, కార్మికుల వేతనాలు చెల్లించాలని సర్పంచ్‌లకు సూచించారు. ఈ సందర్భంగా అధికారులు తమతమ నివేదికలు చదివి వినిపించారు. అనంతరం మండల వ్యవసాయాధికారి బి. రాజు మాట్లాడుతూ.. వ్యవసాయ కార్యాలయాన్ని అద్దె భవనంలో కొనసాగుతోందని, ఆరు సంవత్సరాలుగా రూ.6 లక్షల అద్దె బకాయి చెల్లించాల్సి ఉందని తెలిపారు. దీంతో భవన యజమాని తరచూ నిలదీస్తున్నాడని సభ దృష్టికి తీసుకొచ్చారు. మరో నెల రోజుల్లో ప్రస్తుతం కొనసాగుతున్న కేజీబీవీ పాఠశాల నూతన భవనంలోకి మారిన అనంతరం పాత భవనాన్ని వ్యవసాయ కార్యాలయానికి అప్పగిస్తామని ఎంపీపీ, ఎంపీడీఓ హామీ ఇచ్చారు. సమావేశంలో ఎంపీడీఓ వెంకటాచారి, ఎంపీఓ దయాకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

## కంతమహేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



గౌడ పెద్దలకు విరాళం అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు

**కోదాడరూరల్ :** మండల పరిధిలోని ఎర్రవరంలో నూతన కంతమహేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి స్థానిక పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు బుధవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ కులస్తులు ఐక్యంగా ఆలయాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు పెండెం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు బెల్లంకొండ నాగయ్య, మాజీ సర్పంచ్ బాషబోయిన భాస్కర్‌రావు, బెల్లంకొండ వెంకటేశ్వర్లు, రావుల వెంకటి, కొండ అంజి, రామారావు, సైదులు ఉన్నారు.

## ‘కంటి వెలుగు’ దేశానికే ఆదర్శం

**కోదాడరూరల్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ఎంపీపీ చింత కవితారాధారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని రామలక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు అందజేయబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాముల మస్తాన్, పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు, బుచ్చమ్మ, వెంకట్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కవిత

## ట్రిపుల్‌ఆర్ సెంటర్ ప్రారంభం

**హుజూర్‌నగర్ :** పట్టణంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గెల్లి అర్చన రవి అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛ భారత్ 2.0 లో భాగంగా ట్రిపుల్‌ఆర్ సెంటర్ (రెడ్యూస్ రీసైకిల్, రీయూజ్)ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మురుగు కాల్వలు శుభ్రపరిచి, పిచ్చి మొక్కలు తొలగించి శ్రమదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రానున్న వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని వార్డులలోని మురుగు కాల్వలో పూడికతీత పనులు చేపట్టాలని, రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని చెప్పారు. ట్రిబుల్‌ఆర్ సెంటర్ల ద్వారా సేకరించిన పాత దుస్తులు, బొమ్మలు, చెప్పులు, పుస్తకాలను పాడి వ్యర్థాలను పారవేయకుండా వాటిలో ఉపయోగపడేవి పేదలకు అందజేయాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.అశోక్, ఈఈ రాజశేఖర్, జవాన్లు, మెప్మా సిబ్బంది, వార్డ్ ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.



ట్రిపుల్‌ఆర్ సెంటర్ల ద్వారా సేకరించిన దుస్తులను పేదలకు అందజేస్తున్న చైర్ పర్సన్

## మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ




కొవ్వత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సమాఖ్య నాయకులు

**హుజూర్‌నగర్ :** భారత రెజ్లర్లను లైంగికంగా వేధించి, అసభ్యంగా ప్రవర్తించిన కోచ్ బ్రిజ్ భూషణ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ భారత జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో హుజూర్‌నగర్‌లో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలను లైంగికంగా వేధించిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లీశ్వరి, పట్టణ కార్యదర్శి వై.ఉమ, పి.యశోద, రామనర్సమ్మ, పద్మ, లక్ష్మమ్మ, పర్విద, ఉష, మంగమ్మ, జాన్‌బీ, తిరుపతమ్మ, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉచితంగా వైద్య పరీక్షలు, మందులు



రోగులకు వైద్యం చేస్తున్న డాక్టర్

**హుజూర్‌నగర్‌రూరల్ :** మండలంలోని వేపలసింగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సర్పంచ్ అన్నెం శిరీషాకొండారెడ్డి ప్రారంభించారు. కాగా ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా గ్రామస్తులకు రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి డాక్టర్.సన మాట్లాడుతూ గ్రామస్తులు రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఈఓ ప్రభాకర్, పీహెచ్ఎన్ నూర్జహాన్, ఎల్‌టి.రమేష్, శ్రీను, సావిత్రి, స్వరూపరాణి, కార్యదర్శి నాగమణి, ఆశాలు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల తనిఖీ

**మఠంపల్లి :** మండలంలోని అవిరేణికుంటతండా, లాలితండా, పెదవీడులలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఎంపీడీఓ జానకిరాములు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల హాజరు నమోదు రెండు పూటలూ చేపట్టాలన్నారు. పంచాయతీ తీర్మాణాల ద్వారా రైతుల అనుమతి పొంది భూములు, కాలువలు, దొంకదారులు తదితర పనులు చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఆంజనేయులు, ఏపీఓ ఉమాదేవి, సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.



అవిరేణికుంటతండాలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ జానకిరాములు

## వీఓఏల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యే సైదిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న వీఓఏ సంఘం నాయకులు

**హుజూర్‌నగర్ :** వీఓఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని వీఓఏల సంఘం నాయకులు ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని కోరారు. బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొంతకాలంగా వీఓఏలు పని ఒత్తిడి, అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్నారని తెలిపారు. వీఓఏల ప్రతినిధిగా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపజేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే హామీమేరకు నిరసన విరమించి తిరిగి విధులకు హాజరవుతన్నామ చెప్పారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం నాయకులు రమాదేవి, సంధ్య, స్రవంతి, బేబీరాణి, నాగమణి, లక్ష్మి, శ్రీనివాస్, రామయ్య, వెంకటేశ్వర్లు, నియోజకవర్గంలోని వీఓఏలు పాల్గొన్నారు.

## జనార్దన్‌రావుకు పలువురి నివాళి

**నడిగూడెం:** మండల పరిధిలోని శ్రీరంగాపురం గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ చైర్మన్ కొల్లు రామారావు కుమారుడు జనార్దన్‌రావు ఇటీవల మృతి చెందారు. బుధవారం గ్రామంలో నిర్వహించిన సంతాప సభకు బీఆర్ఎస్ పార్టీ మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావులు హాజరై జనార్దన్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం కల్పించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, వనపర్తి లక్ష్మీనారాయణ, నడిగూడెం జెడ్పీటీసీ బాణాల కవిత నాగారాజు, పెండెం వెంకటేశ్వర్లు, గుండపనేని నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



జనార్దన్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

## నర్సరీల్లో నీటి సమస్య లేకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఈదయ్య

**చిలుకూరు :** గ్రామాల్లోని నర్సరీల్లో నీటి సమస్య లేకుండా చూడాలని ఎంపీడీఓ ఈదయ్య అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సరీలలో మొక్కలు, పల్లె ప్రకృతి వనాల్లో చెట్లు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించాలని, పని ప్రదేశాల్లో కూలీలకు వసతులు కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ పాండుయాదవ్, ఏపీఓ నిర్మల, ఈసీ మాధవి, టీఏలు స్రవంతి, గిరి ప్రసాద్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.